ప్రజాశక్తి
మంగళవారం 28 ఫిబ్రవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



ఎన్నికల ప్రచారంలో వి.కృష్ణయ్య, ప్రజాసంఘాల నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి వి.కృష్ణయ్య కోరారు. సోమవారం మండలంలోని ఏల్చూరు గ్రామంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సచివాలయ ఉద్యోగులను, గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ నీతి, నిజాయతీ, నిబద్ధతతో పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థులను ఎమ్మెల్సీ ఎన్నికల లో గెలిపించాలన్నారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పి.బాబురెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆయా సంఘాల సమస్యలు శాసనమండలి లో చర్చకు రావాలంటే అది పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు ద్వారానే సాధ్య మన్నారు. కావున ఉద్యమ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా మన హక్కులను కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వలీఖాన్, ముస్తఫా, ప్రజాసంఘాల నాయకులు వేటగిరి మస్తాన్, సిఐటియు పల్నాడు అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సారథులు

- జనంపై పార్టీలపరంగా ఒత్తిళ్లు.. నిఘాలు
- వైసిపి..తెలుగుదేశం.. రెండు పార్టీల్లోనూ ఇదే తంతు
- ఓట్ల కోసం 50 ఇళ్లకు ఒక కార్యకర్త నియామకం



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జనంపై క్షేత్రస్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. నిఘాలు పెంచుతున్నారు. ఎవరు ఏ పార్టీకి అనుకూలంగా ఉంటున్నారు? గతంలో ఏ ఇంటిలో నుంచి ఓట్లు ఏ పార్టీకి పడ్డా యి? అనే పరిశీలనపై పార్టీలు దృష్టి సారించాయి. ఇప్పటికే గ్రామాల్లో రాజకీయంగా గ్రూపులున్నాయి. నేతలతో పాటు ఓటర్లు కూడా కీలకంగా వర్గపోరు లో ఉంటున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు కొనసాగుతున్నాయి. సమస్యాత్మక గ్రామాల సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. ఎన్నికల నాటికి సగానికిపైగా సమస్యాత్మక గ్రామా ల జాబితాల్లో కనిపిస్తుంటాయి. ఇప్పుడు ఎన్నికల కోసం వైసిపి, తెలుగుదేశం రెండు పార్టీలు ఓటర్లపై నిఘా పెంచేందుకు పార్టీల నుంచి గృహ సారథులు, సెక్షన్ ఇన్‌ఛార్జిల పేరుతో కార్యకర్తలను పెడుతున్నారు. వారికి శిక్షణ కూడా ఇస్తున్నారు. గ్రామాల్లో ఏం చేయాలన్న దానిపై వారికి హితబోధ చేస్తున్నారు. ఎంపిక చేసిన అందరికీ శిక్షణ కొనసాగుతోంది. ఎమ్మెల్యేలు ఈ భేటీలకు హాజరై గ్రామాల్లో వ్యవహరించాల్సిన పంథాపై వివరిస్తున్నారు. ప్రతి ఓటరు సమాచారం అందుబాటులో ఉండాలని సూచిస్తున్నారు. పార్టీలపరంగా ఎజండాలున్నా క్షేత్రస్థాయిలో నిఘా వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.

వైసిపి 50 ఇళ్లకు ఒక కార్యకర్తను గృహసారథిగా పెడుతున్నారు. తెలుగుదేశంలో 100 ఓటర్లకు కలిసి సెక్షన్ ఇన్‌ఛార్జి పేరుతో ఒక కార్యకర్తను పెడుతున్నారు. వార్డు లేదా డివిజన్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని ఒక ఇన్‌ఛార్జిని, ఐదు డివిజన్లు కలిపి ఒక ఇన్‌ఛార్జిని పెడుతున్నారు. వీళ్లు పార్టీ నుంచి ఎన్నికల్లో వ్యవహరించాల్సివన్నీ చూస్తారు. ఓటర్ల చేర్పులు మొదలు ఓటేసే పర్వం దాకా అన్ని వ్యవహారాలపై కేంద్రీకరించే అవకాశం ఉంది. వీళ్ల సూచనల మేరకే అధికారులు నిర్ణయాలు తీసుకుంటారా? లేక పరిశీలన చేసి నిర్ణయాలు తీసుకుంటారా? అనేదీ చూడాలి. ప్రస్తుతం వైసిపి నుంచి ఎంపిక చేసిన వారికి సంక్షేమ పథకాలు ఎలా అందాయి? ఇంకా రావాల్సిన వారికి ఇప్పించే కార్యక్రమాలు అప్పగిస్తున్నారు. 50 ఇళ్ల అవసరాలను గుర్తించడంతో పాటు వారిని అన్ని రకాలుగా ప్రభుత్వంపై సానుకూలత ఏర్పడేలా గృహసారథులు చూడాల్సి ఉంది. ఇదే లక్ష్యం నిర్దేశిస్తున్నారు. ఇప్పటివరకూ 50 ఇళ్లకు వాలంటీర్‌ను పెట్టారు. వీరే ఇప్పటివరకు పార్టీ కార్యకర్తల్లాగానే పనిచేస్తున్నారు. పాలకపక్షానికి నమ్మిన బంట్లుగా ఉన్నారనడంలో సందేహం లేదు. అన్ని సంక్షేమ పథకాలను అమలుచేయడంలో వీరి పాత్రే కీలకంగా మారింది. ఇప్పుడు గృహసారథులు కూడా వాలంటీర్లతో సమన్వయం చేసుకుని ఎన్నికల్లో పార్టీకి అన్ని విధాలా మేలు జరిగేలా చూడాల్సి ఉంటుంది. ఇదే వారి ఎజెండా కానుంది. తెలుగు దేశం పార్టీ కూడా 100 ఓటర్లకు ఒక సెక్షన్ ఇన్‌ఛార్జి పేరుతో కార్యకర్తలను పెడుతోంది. వీరికి కూడా వార్డుల్లో ఎలా ఉండాలో హితబోధ చేస్తున్నారు. పార్టీలో బాగా కష్టపడి పనిచేసే వారినే ఎంపిక చేస్తున్నారు. అన్నీ తానై ఉన్న వారిని పెడుతున్నారు. వీళ్లు కూడా ఓటర్లపై ▶ 2లో

సిమెంటు గల్లంతు!

- 12 వేల బస్తాలు మాయం
- హడలెత్తుతున్న పీఆర్ ఇంజనీర్లు
- యర్రగొండపాలెం నియోజకవర్గంలో కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో 12 వేల బస్తాల సిమెంట్ మాయమైంది. ఖద్దరు నేతలు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాల నిర్మాణానికి వచ్చిన సిమెంట్‌ను అమ్మేసుకున్నారు. దీంతో పంచాయితీరాజ్ ఇంజనీర్లు ఎంత మొత్తుకుంటున్నా ఇప్పుడు అక్కడ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

సచివాలయాల నిర్మాణం కోసం..

గ్రామ సచివాలయాల నిర్మాణం కోసం ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్ గల్లంతైంది. గ్రామాల్లో డంప్ చేసిన వెంటనే అధికార పార్టీ నేతలు స్వాహా చేసేశారు. పంచాయతీరాజ్ ఇంజనీర్ల పేరున సిమెంటు సరఫరా కావడంతో ఈ వ్యవహారం వారి మెడకు బిగుసుకుంది. విజిలెన్స్ దాడులతో హడలెత్తిపోతున్నారు. తమను బాధ్యులను చేయడంపై మండిపడుతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే, సహాయ నిరాకరణకు దిగి.. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలన్న యోచనలో ఉన్నట్లు సమాచారం.

బాధ్యులుగా ఇంజనీర్లు..

పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వమే పూనుకుంది. అధికార పార్టీ నాయకులను ప్రోత్సహించి పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. అయినా పలు రకాల అడ్డంకులు ఏర్పడ్డాయి. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పలు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు పూర్తిగా భవనాలు నిర్మించలేకపోయారు. మరికొన్ని గ్రామాల్లో స్థలాల కొరత వేధిస్తే, మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ వివాదాల్లో ఉంది. ఈ కారణాలతో మంజూరైన భవనాలను సైతం నిర్మించలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో స్తోమత కలిగిన స్థానిక నేతలు లేకపోవడంతో ఇంజనీర్లకు ఒత్తిడి పెరిగింది. నిర్మాణాలు చేపట్టినా సర్కారు బిల్లులిస్తుందన్న నమ్మకం తొలుత వైసీపీ నేతలకు కలగలేదు. దీంతో సిమెంట్ లోడు దిగడంతో ఉత్సాహంగా పనిలోకి దిగారు. సిమెంట్ వచ్చీరాగానే కొన్ని గ్రామాల్లో సిమెంట్‌ను అమ్ముకున్నారు. మరికొన్ని గ్రామాల్లో అప్పట్లో వర్షాలు పడుతుండటంతో సిమెంట్‌ను వేరే అవసరాలకు బదిలీ చేశారు. ఈ సిమెంట్ మొత్తం ఇంజనీర్ల పేరు మీద సిమెంట్ కంపెనీలు సరఫరా చేశాయి. ఈ సిమెంట్‌కు బాధ్యులను ఇంజనీర్లను చేశారు. అయితే సిమెంట్ మాత్రం గ్రామాల్లో వైసీపీ స్థానిక నేతల కనుసన్నలో ఎత్తేశారు.

స్థలాల పరిశీలన లేకుండానే..

సచివాయాలతో పాటు ఆర్బీకే, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీ ఇలా ప్రతి కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్లు భవనాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. స్థలాల పరిశీలన, నిర్మాణాల అంచనా ఏదీ లేకుండానే కంపెనీల నుంచి సిమెంటు ముందే డంప్ చేశారు. కొన్నిచోట్ల పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోయినా పనులు ప్రారంభించాలని కలెక్టర్లు ఇంజనీర్లపై ఒత్తిడి తెచ్చారని చెబుతున్నారు. వేల బస్తాల సిమెంటు సరఫరా కావడంతో అధికార పార్టీ నేతల కన్నుపడింది. ఈ నేపథ్యంలో సిమెంట్ గల్లంతుపై రహస్యంగా విచారణ ▶ 2లో

సాగునీటి కాలువ మాయం

- సుమారు 250 ఎకరాల భూమికి సాగునీరు అందించే బోదె కాలువ పూడ్చివేత
- పొలాలకు నీళ్లు పెట్టుకొనే అవకాశం లేక రైతులు ఆవేదన
- ఎన్ఎస్‌పి అధికారులకు రైతుల ఫిర్యాదు
- ఇది రెవెన్యూ పరిధిలోకి వస్తుందని అధికారుల ప్రకటన



తూమును మూసివేసిన ప్రాంతం

ప్రజాశక్తి-పంగులూరు

సుమారు 250 ఎకరాల సాగుభూమికి సాగునీరు అందించే బోదె కాలవను, కొంత మంది పూడ్చివేసి మాయం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై రైతులు ఎన్ఎస్‌పి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు సోమవారం వచ్చి పరిశీలించారు. పంగులూరు మండలం లోని పమిడిపాడు మేజర్ కాలువ నుంచి వచ్చే పంగులూరు మైనర్ కాలువ 7.5 కిలోమీటర్ల పొడవు ఉంది. ఇందులో 4.8 కిలోమీటర్ల దగ్గర 8 ఎల్, డి.పి (బోదె కాలువ) ఉంది. ఈ బోదె కాలువకు పంగులూరు మైనర్ కాలువలో నుండి తూము వేసి, అక్కడ నుండి ఈ కాలువకు రైతులు నీళ్ల తీసుకుంటారు. ఈ తూమును కరణం గారి తూము అని రైతులు పిలుచుకునేవారు. కుర్ర వారి పొలాల వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవు వరకు ఉన్న ఈ కాలువ కింద సుమారు 100 మంది రైతులకు ఇక్కడ పొలాలు ఉన్నాయి. గతంలో ఈ కాలువ కింద 250 ఎకరాల మాగాణి పండేది. అయితే ఇప్పుడు ఆ పొలంలో మాగాణి పంట పూర్తిగా నిలిపివేసి సుబాబుల్, ఇతర రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలకు కూడా ఈ తూము నుండే సాగునీరు వచ్చేవి. అయితే ఈ తూమును పగలగొట్టి, అందులో నుండి నీళ్ల రాకుండా ఉండేందుకు రాళ్ళు, మట్టి వేసి ఆ తూము నుంచి వచ్చే బోదె కాలువను కొంత మంది పూర్తిగా పూడ్చి వేసి.. కాలువను మాయం చేశారు. కాలువను పరిశీలించిన ఎన్ఎస్‌పి అధికారులు ఈ బోదె కాలువలు తమ పరిధిలోవి కావని, రెవెన్యూ అధికారు లకు సంబంధించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఎస్పి ఏఈ విశ్వమోహన్, వర్క్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి, లస్కర్లు రత్నరాజు, వినోద్‌కుమార్, రైతులు ఆంజనేయులు, రామకృష్ణ, రాగిన బోయిన రాదయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సారథులు

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి సారించి తమకు అనుకూలంగా మారేలా చేసుకోవడమే ఎజండాగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం పెద్దగా వివాదాలు లేకపోయినా ఎన్నికలు సమీపించే నాటికి గ్రామాల్లో ఈ సైన్యం వల్ల ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయేనన్న చర్చ కూడా ఉంది. ఇప్పటివరకూ గ్రామాల్లో పెద్దలే పార్టీకి అన్నీ తామై వ్యవహరించారు. సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పార్టీలపరంగా ఎవరు గెలిస్తే వాళ్లే పెత్తనం చేసేవాళ్లు.. ఇప్పుడు కొత్త సైన్యం భారీగా తెరపైకి వచ్చింది. వీళ్లంతా ఎన్నికల్లోకి దిగితే రెండు వైపులా నువ్వానేనా అన్నట్లుగానే పరిస్థితి మారే అవకాశం ఉంది. ఓటర్ల సమాచారం అంతా వీరివద్దే ఉండే అవకాశం ఉంది. వార్డుల్లో 50 ఇళ్లకు ఒకరిని రెండు పార్టీల నుంచి పెట్టడం వల్ల సమస్యలు కూడా వచ్చే ప్రమాదం లేకపోలేదు. దిగువస్థాయిలో మరింత కేంద్రీకరించాక కొత్త సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. అధికారుల పర్యవేక్షణ పాత్ర కూడా ఇదే సమయంలో పెరగాల్సి ఉంది. పాలకపక్షాలకు అనుకూలంగా ఓట్ల చేర్పులు, తొలగింపులు వంటివి జరిగితే సమస్యలు కూడా తప్పవు. ఫిర్యాదులూ పెరిగే అవకాశం ఉంది. ఏదేమైనా పార్టీల నుంచి ఓటర్లపై పెడుతున్న సైన్యం సంయమనం పాటించాలి. ఓట్ల కోసం మోహరింపే కీలకమైతే జనానికి ముఖ్యంగా తటస్తులుగా ఉన్న వారికి ఇబ్బంది తప్పదు. ఓటరు స్వేచ్ఛకూ భంగం కలగనుందనే చర్చ సాగుతోంది. ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేలా ఈ క్షేత్రస్థాయి రాజకీయ వ్యవస్థ పనిచేస్తే అందరికీ మేలు జరుగుతుంది.

సిమెంటు మాయం

(మొదటిపేజీ తరువాయి)

జరిగినట్లు తెలుస్తోంది.

పూర్తి కాని పనులు..

ఏడాదికి ముందు సిమెంట్ సరఫరా చేసినా ఇప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. సరఫరా చేసిన సిమెంట్ ఏమైందన్న విషయంపై తనిఖీ మొదలైంది. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో భవన నిర్మాణాల పునాదులు దాటకపోయినా సిమెంట్ నిల్వలు ఖాళీ అయినట్టు గుర్తించారు. కొన్ని గ్రామాల్లో సిమెంట్‌ను ఇతర అవసరాలకు వినియోగించుకున్నారు. మరికొన్ని చోట్ల పాడుబడ్డ పాత భవనాల్లో నిల్వచేయడంతో పాడైనట్టు తేలింది. మొత్తంగా ఈ తనిఖీల్లో సిమెంట్‌ను ఇంజనీర్ల పేరు మీద ఇవ్వడంతో వారినే బాధ్యులను చేస్తున్నట్లు సమాచారం.

అబ్దుల్ మజీద్ మృతి

ప్రజాశక్తి-దొనకొండ

ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు షేక్ అబ్దుల్ మజీద్ (50) గుండె పోటుతో సోమవారం మృతి చెందాడు. మజీద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పలువురు ప్రముఖులు, బంధు మిత్రులు, గ్రామ పెద్దలు మజీద్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

పెద్దారవీడు : మండల పరిధిలోని ఎరువుల దుకాణాలను గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలజీ నాయక్ సోమవారం తనిఖీ చేశారు. తొలుత మండల పరిధిలోని కుంట గ్రామంలోనున్న శివశంకర్ ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేశారు. ఏజెన్సీ వారికి ప్రభుత్వం గుర్తింపు లేని గోడౌన్ గుర్తించి రూ.1,07,600 విలువైన ఎరువులను సీజ్ చేశారు. రిజిస్టర్‌లను తనిఖీ చేసి డీలరుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎఒ కె.బుజ్జిబ్బాయి, ఎఒ షేక్ మహమ్మద్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

దర్శి : సైన్స్ డే సందర్భంగా విద్య వైజ్ఞానిక సదస్సు డాక్టర్ ఝూన్సీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. అనంతరం సంఘమిత్ర వైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, మెజీషియన్ రామన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విధులు నిర్వహించే చోటే నివాసముండాలి

డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రతి ఎంపిహెచ్‌పి వారికి నిర్ధేశించిన హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో విధులు నిర్వహించే చోటే నివాసం ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి ఆదేవించారు. డిఎం,హెచ్‌ఒ కార్యాలయంలో ఎం.పి.హెచ్.పి./సిహెచ్‌ఒలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిఎం,హెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల రిజిస్టర్లు, రికార్డులను అనుసరించి తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. ఒపి, ఎన్‌సిడి, కేన్సర్, స్టాక్ రిజిస్టర్, శాశ్వత మరియు తాత్కాలిక పరికరాల రిజిస్టరు ,పెర్ఫామెన్స్ ఇండికేటర్ రిజిస్టర్‌లను క్షుణ్ణంగా తయారు చేసి ప్రతి రోజు వాటిని అన్ని వివరాలతో పూర్తి చేయాలన్నారు. . ప్రతి హెచ్‌డబ్ల్యుసిలో జనరల్ ఇన్ఫర్మేషన్ రిజిస్టరు ఉంచాలన్నారు. జన ఆరోగ్య సమితిలను ఏర్పాటు చేయాలన్నారు. ఆశ, ఎఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లతో ప్రతి రోజు గ్రామాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు. ప్రజలకు శాశ్వత తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు, అనీమియా ,ఫ్రైడే డ్రైడే , ఎం.సి.పి. కార్డ్స్, సేఫ్ డెలివరీ క్యాలండర్ , వైఎస్ఆర్. ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. ఎన్‌సిడి కార్యక్రమం ద్వారా సాధారణ రుగ్మతలైన డయాబెటిస్, రక్తపోటు, కేన్సర్ తగిన పరీక్షలు చేసి చికిత్సను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ టి. వాణిశ్రీ. డిపిఎంఒ సుగుణమ్మ డిపిహెచ్‌ఎన్ఒ , సుబ్బలక్ష్మి, డిపిఒ మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు .



మాట్లాడుతున్న డిఎం,హెచ్‌ఒ డాక్టర్ రాజ్యలక్ష్మి

సచివాలయాలతో మెరుగైన సేవలు : బాలినేని

ప్రజాశక్తి- కొత్తపట్నం

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టినట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో గహసారథులు, సచివాలయాల కన్వీనర్లకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ రూ. 20 కోట్లతో కొత్తపట్నంలో విద్యుత్ స్తంభాలు ఆధునికరించినట్లు తెలిపారు. బకింగ్ హామ్ కెనాల్ వద్ద బ్రిడ్జి పనులు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వనందువల్లే ఆగిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంజిరెడ్డి, జడ్‌పిటిసి సైకం శారద, మాజీ ఎంపిపిలు వాయిల మోహన్ రావు, శ్రీనివాసరావు, మత్స్యకార సంఘం డైరెక్టర్ సుమతి, విఆర్‌సి రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని

'పది' విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాలలో రాణించాలని ఎస్‌విఆర్ హైస్కూల్ కరస్పాండెంట్ చింతా తిరుపతిరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం వీడ్కోలు వేడుకలు ప్రిన్సిపల్ సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 10వ తరగతి పాసైన విద్యార్థులు మంచి గ్రూపులను ఎంచుకుని అభివృద్ధికి అనుగుణంగా విద్యలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

సంతనూతలపాడులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడులో సోమవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వ హించారు. అందులో భాగంగా శివాలయం వద్దనున్న మంచినీటి బావి వద్ద బ్లీచింగ్ చల్లి క్లోరినేషన్ చేశారు. అనంతరం దోమల నివారణకు బావి చుట్టూ మరియు ప్రక్కనున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, సున్నాన్ని చల్లారు. అనంతరం గ్రామంలోని అన్ని బావుల్లోనూ క్లోరినేషన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దర్శి నాగమణి, ఇఒఆర్‌డి రామకష్ణ, కార్యదర్శి టి.పోతురాజు, ఉపసర్పంచి ఐవి. సుబ్బయ్య , పంచాయతీ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మస్తావలికి సేవా పురస్కారం

ప్రజాశక్తి -పొదిలి

రాములేటి మస్తాన్ వలి గత మూడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా వివేకా నంద జాతీయ సేవా పురస్కారం దక్కింది. విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఆకుమళ్ల నాని చేతుల మీదుగా మస్తాన్‌వలి ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అకుమళ్ళ, బాదుల్లా, వెంకట్రావు, చైతన్య పాల్గొన్నారు.



సేవా పురస్కారం అందుకుంటున్న మస్తాన్ వలి

మహారాజశ్రీ మార్కాపురం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

ఓ.ఎస్. 384/2020

దొండేటి వెంకటరామిరెడ్డి ....వాది

వర్సెస్

దొండేటి గురువారెడ్డి వగైరాలు .... ప్రతివాదులు

టు,
కొప్పుల రమణ, భర్త: కాశిరెడ్డి,
తండ్రి: గురువారెడ్డి అలియాస్ గురవయ్య, గృహిణి,
నివాసం: గంగుపల్లి గ్రామం, తర్లుపాడు మండలం,
ప్రకాశం జిల్లా.

నోటీసు

పై దావాలో వాది, ప్రతివాదులు మరియు మీపై భాగ పరిష్కార నిమిత్తం దావా వేసినారు. అట్టి దావా నందు ఎన్నిమార్లు నోటీసులు పంపించిననూ అందుకొనక కాలాయాపన చేయు చున్నారు. అందుచేత శ్రీ కోర్టులో మీ హాజరు నిమిత్తం తేదీ: 06-03-2023కి వాయిదా వేసి యున్నారు. కావున తేదీ: 06-03-23న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ముందు స్వయ ముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమందు దవాను తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
ముమ్మడి ప్రభాకరరెడ్డి, బిఎ,బిఎల్
అడ్వకేట్, మార్కాపురం.

వేలం ప్రకటన

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి దర్శి వారి కోర్టులో

ఒ.యస్.215/2008

ఇ.పి.3/2015

చిన్నపురెడ్డి ధనలక్ష్మి ..... డి.హెచ్.ఆర్

వర్సెస్

యాడిక వెంకటరెడ్డి .... జె.డి.ఆర్

పై కోర్టు నందు దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలా భూమిని తే. 16-03-2023 దిన ఉదయం గం. 10-30 ని.లకు బహిరంగ వేలము ద్వారా విక్రయించబడును. కాన వేలములో పాల్గనదలచిన పాటదారులు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, దరిశి సబ్ డిస్ట్రిక్ట్, తాళ్ళూరు మండలం, నాగంబొట్లపాలెం గ్రామ సర్వే నెం. 137/6 ఎ. 1-19 శెంట్లు తోట భూమికి హద్దులు :

తూర్పు : గుజ్జుల యోగిరెడ్డి భూమి
దక్షిణం : యాడిక శ్రీనివాసరెడ్డి తండ్రి హనుమారెడ్డి భూమి
పడమర : యాడిక శ్రీనివాసరెడ్డి తండ్రి హనుమారెడ్డి భూమి
ఉత్తరం : గుజ్జుల యోగిరెడ్డి భూమి
డి.హెచ్.ఆర్. విలువ : రూ. 1,00,000/-
అమీనా విలువ : రూ. 6,00,000/-
వేలం తేది : 16-03-2023

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

విచారణ తేది : 23-03-2023 ఇట్లు
దరిశి **యం. సుబ్బారెడ్డి**
తేది :27-02-2023 అడ్వొకేట్,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్ : **93477 28417**

జగనన్న లేఅవుట్‌లో వరుస చోరీలు

బెంబేలెత్తుతున్న కాలనీ వాసులు ● రూ.5 లక్షల విలువైన సిమెంట్, ఇనుము మాయం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

వరుస దొంగతనాలతో జగనన్న లే అవుట్‌లలో నిర్మాణాలు జరుపుకుంటున్న లబ్ధిదారులు బెంబేలెత్తి పోతున్నారు. ఆదివారం అర్ధరాత్రి మండల పరిధిలోని వలపర్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఉంచిన విలువైన ఇనుప చువ్వలు, సిమెంట్ బస్తాలు, ఇళ్ల కోసం తీసుకొచ్చిన దర్వాజాలు భారీగా చోరీకి గురవడాన్ని స్థానికులు సోమవారం గుర్తించి లబ్ధిదారులను అప్రమత్తం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 20 మంది లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇనుప చువ్వలు, దర్వాజాలు తమ ఇళ్లముందు భద్రపరుచుకున్నారు. సోమవారం ఉదయం జగనన్న లేఔట్‌లలో చోరీ జరిగిందన్న సమాచారం



వలపర్ల గ్రామంలోని జగనన్న లేఅవుట్

అందుకున్న కాలనీవాసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా 6,10,12, మిల్లి మీటర్ల పరిమాణం గల 525 ఇనుపచువ్వలు, దర్వాజాలు, ఇనుప స్టాండులు, తడికెలు, 20 సిమెంట్ బస్తాలు చోరీకి గురైనట్లు గుర్తించి బాధితులు లబోదిబోమంటూ స్థానిక మహిళా పోలీసుకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.5 లక్షలు విలువ ఉంటుందని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. గత మూడు నెలల క్రితం ఇదే కాలనీలో విద్యుత్ ప్యానల్ బోర్డులు నీటి మోటారు, ఇతర విద్యుత్ సామగ్రి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు ఎటువంటి ఫలితం లేదని బాధితులు విలేకర్ల ముందు వాపోయారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి నిందితులను గుర్తించి తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గుర్తు తెలియని వృద్ధురాలు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని రాయవరం గ్రామ సమీపంలోని మార్కాపురం రైల్వేసేష్టన్ నుంచి తర్లుపాడు వెళ్లే మార్గంలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మార్కాపురం రైల్వే సేష్టన్ నుంచి తర్లుపాడుకు వెళ్లే మార్గమధ్యంలో స్టోన్ నెంబర్ 145/1 వద్ద గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం పడిఉండటాన్ని గమనించిన ట్రాక్‌మేన్ మార్కాపురం స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించాడు. సేష్టన్‌మాస్టర్ ఘటన గురించి రైల్వే పోలీసులకు తెలుపగా ప్రభుత్వ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఈ హరికృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి ఆత్యహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్కాపురం ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ ఈ హరికృష్ణారెడ్డి తెలిపారు.

65 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-చీరాల

ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామీణ సీఐ మల్లిఖార్జునరావు హెచ్చరించారు. సోమవారం ఉదయం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు గ్రామీణ సీఐ మల్లిఖార్జునరావు, ఈపూరుపాలెం ఎస్ఐ పి జనార్ధన్ సిబ్బందితో తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపూరుపాలెం రహదారిలో పట్టను కప్పుకుని వెళుతున్న వాహనాన్ని నిలువరించారు. దీనిని పరిశీలించగా అందులో రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సీఐ మాట్లాడుతూ.. మొత్తం 65 బియ్యం బస్తాలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో కారంచేడుకు చెందిన తెల్లమేకల రాఘవ, చీరాల వైకుంఠపురానికి చెందిన గాజుల వెంకటేశ్వరరావు, ఈపూరుపాలెం సీతారామపేటకు చెందిన రేషన్ డీలరు జి కేశవరావులను అరెస్టు చేసినట్లు తెలిపారు. దానిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

అక్రమ మద్యం సీజ్

తండ్రి అరెస్టు, కొడుకు పరార్ ● 60 సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల

గోవా నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ విక్రయాలకు పాల్పడుతున్న స్థావరాలపై సోమవారం సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. చీరాల ప్రాంతానికి చెందిన తండ్రీకొడుకులు ఈ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన సెబ్ అధికారులు సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి నరసింహారావు మాట్లాడుతూ పట్టణంలోని విఠల్ నగర్‌కు చెందిన మొగిలి సుబ్బారావు మొగిలి రామారావు చికెన్ పకోడి అమ్ముతుంటారు. అత్యాశతో మద్యం తక్కువ ధర ఉండే గోవా రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చి లాభాలకు ఇక్కడ అమ్ము తున్నారు. ఈ క్రమంలో గతంలో రెండుసార్లు వీరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. తిరిగి మరలా ఇదేవిధంగా మద్యం అమ్ముతున్నారని సమాచారం అందిందన్నారు. దీంతో గత పదిరోజులుగా నిఘా ఉంచామన్నారు. మంగళవారం ఉదయం సుబ్బారావు ఇంట్లో రెండు బ్యాగుల్లో ఉన్న 60 గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో సుబ్బారావును అరెస్టు చేశామని, ఇతని కుమారుడు రామారావు పరారీలో ఉన్నాడని తెలిపారు. ఇతనిపై అరెస్టు వారెంట్ తీసుకున్నామని, త్వరలోనే ఇతన్ని కూడా అరెస్టు చేస్తామని చెప్పారు. జిల్లాలో అక్రమ సారాయి, గంజాయి విక్రయించే వాళ్లపై గట్టి నిఘా ఉంచామన్నారు. దాడుల్లో సెబ్ సీఐ సోమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెబ్ అధికారులు

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు జెడ్‌పిటిసి తాతపూడి రత్నరాజుపై ఈ నెల 23న శంకరాపురం గ్రామంలో మేడికొండ నారాయణస్వామి ఆయన భార్య మేడికొండ అనురాధలు దుర్భాషలాడి దాడిచేసి గాయపరిచినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ మేరకు దాడిచేసిన ఇరువురిపై సోమవారం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ముండ్లమూరు ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్ తెలిపారు.



మద్యం బాటిళ్లు చూపుతున్న సెబ్ పోలీసులు

20 మద్యం బాటిల్స్ పట్టివేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామానికి చెందిన ఆరిబోయిన బ్రహ్మయ్య అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారంతో సోమవారం శింగరాయకొండ ఎస్ఇబి ఎస్ఐ దయాకర్ తన సిబ్బందితో దాడి చేశారు. అతని వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అతనిని అరెస్టు చేసి రిమాండుకి తరలించారు. అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు ఉంటాయని హెచ్చరించినప్పటికీ అలాగే మద్యం అమ్ముతుండడంతో నిఘాపెట్టి అరెస్టు చేసి జైలుకు పంపుతామని ఆయన పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వెలిగండ్ల

ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మరణించిన సంఘటన సోమవారం వెలిగండ్ల మండల పరిధిలోని శివార్లలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వెలిగండ్ల మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన బుర్ర బాలకోటిరెడ్డి(48) తన స్వగ్రామం నుంచి వెలిగండ్లకు వస్తుండగా, రామగోపాపురం గ్రామానికి చెందిన దండగ రాజశేఖర్ వెలిగండ్ల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా సూరవారిపల్లి మలుపు వద్ద వారిద్దరి వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలకోటిరెడ్డి తలకు తీవ్ర గాయాలై అధిక రక్తస్రావం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రాజశేఖర్‌కు గాయాలయ్యాయి. 108కి సమాచారం అందించినా ఫలితం లేకపోవడంతో స్థానికులు ప్రైవేట్ వాహనంలో కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ మహేష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతి చెందిన బాలకోటిరెడ్డి



రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందిన యువకుడు

యువకుడు మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గత నెల 24వ తేదీన జాతీయ రహదారికి దక్షిణం వైపున ఉన్న జునో బేకరీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం సంఘటన పాఠకులకు విదితమే. గుర్తు తెలియని యువకుడు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతుండగా సింగరాయకొండ నుంచి ఒంగోలు వైపు అతివేగంగా వెళుతున్న ఏపీ 28సిజె 2230 నెంబరు గల కారు యువకుడిని బలంగా ఢీకొంది. ప్రమాదం జరిగిన వెంటనే యువకుడిని టంగుటూరు 108 వాహనంలో ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం చేర్పించారు. ఈ నేపథ్యంలో ఒంగోలులో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. సంఘటనా స్థలం వద్దనే యువకుడు తల, మెడ భాగంలో గాయాలై తీవ్రంగా రక్తస్రావం జరగడంతో మృతి చెందినట్లు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

36 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి-వేటపాలెం

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ప్రముఖ ఫార్మాసూటికల్ కంపెనీ అయిన హెటిరో డ్రగ్స్ కంపెనీకు 36మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సోమవారం సంయుక్తంగా తెలిపారు. సెయింట్ ఆన్స కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, చీరాల 2007లో స్థాపించబడి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు, ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ వారి గుర్తింపు, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్శిటీ, కాకినాడ వారి గుర్తింపు పొంది ప్రముఖ ఫార్మసీ కళాశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. తమ విద్యార్థులు అధిక శాతం మంది వివిధ బహుళ జాతి సంస్థలలో అత్యుత్తమ వేతనాలతో ఉన్నత ఉద్యోగాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు. గత 5 సంవత్సరాలలో కళాశాల విద్యార్థులు ప్రాంగణ ఎంపికలలో సెలెక్ట్ అయిన విద్యార్థులు వివిధ బహుళ జాతి సంస్థలలో అత్యుత్తమ వేతనాలను పొందుతున్నారని తెలిపారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

కళాశాలలో హెటిరో డ్రగ్స్ కంపెనీ వారు 2023 సంవత్సరంలో బి ఫార్మసీ, బి టెక్ పూర్తి కాబోయే విద్యార్థులకు శని, ఆదివారాల్లో నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్‌లో వివిధ కళాశాలల నుంచి 75 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 36 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ వివి నాగేశ్వరరావు తెలిపారు. బి ఫార్మసీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆరుగురు, ఎం ఫార్మసీ నుంచి ఒక్కరు, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి 13మంది, బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నుంచి 13మంది, ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఒక్కరు, డిసిఆర్ఎం కళాశాల, ఇంకొల్లు నుంచి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ప్రతి విద్యార్థికీ రూ.2.84 లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు లభిస్తాయని తెలిపారు. 2023 సంవత్సరం జూన్ 1న హెటిరో డ్రగ్స్ కంపెనీలో విధులలో చేరవలసి ఉంటుందని కళాశాల ప్రాంగణ ఎంపికల విభాగ అధికారి ఎన్ పూర్ణచంద్రరావు తెలిపారు.

వికలాంగుల సంక్షేమాన్ని గాలికొదిలిన ప్రభుత్వం

టిడిపి వికలాంగ నాయకుల ధ్వజం



ధర్నాలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ప్రజాశక్తి-బాపట్ల

వికలాంగులకు న్యాయపరంగా అందాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వం వారికి తీరని అన్యాయం చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వికలాంగుల విభాగం అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బాపట్ల పట్టణం చీలు రోడ్డు సెంటర్లో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ విభిన్న ప్రతిభావంతుల విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వికలాంగుల మహాధర్నాలో గోనుగుంట్ల మాట్లాడారు. వికలాంగులకు జరుగుతున్న అన్యాయాలపై పెద్ద ఎత్తున ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో వికలాంగులకు సంక్షేమ పథకాలు నిలిపివేయడం దారుణమన్నారు. సకలాంగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వికలాంగులకు మొండిచేయి చూపుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారికి రావాల్సిన పెన్షన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనల పేరుతో వికలాంగులకు పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు నిలుపుదల చేయడం దారుణమని అన్నారు. గత ప్రభుత్వంలో వికలాంగుల అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు, వారికి సౌకర్యంగా ఉండేలా ట్రై సైకిల్, మోటర్ వాహనాలు, వివాహ ప్రోత్సాహకాలు, ఉపాధి కల్పనకు సబ్సిడీపై రుణ సదుపాయం కల్పించి ఆదుకుందన్నారు. కార్యక్రమానికి సహాయ సహకారాన్ని అందించిన బాపట్ల నియోజకవర్గ టిడిపి బాధ్యులు వేగేశన నరేంద్రవర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్టీ వికలాంగుల సంఘం నాయకుడు విజయ్‌కుమార్, పార్టీ నాయకులు పల్లం సరోజిని, స్థానిక వికలాంగ నాయకులు, బాపట్ల, రేపల్లె, వేమూరు, చీరాల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.




విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలం శంఖవరప్పాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళ్ల జోళ్లు సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 21 మంది విద్యార్థులకు దాత సోము రమణారెడ్డి సౌజన్యంతో కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రోటరీ ప్రెసిడెంట్ సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహారంలో ఏ విటమిన్ లభించే ఆకుకూరలు, కారట్, గుడ్డు వంటివి తీసికొని జాగ్రత్తలు పాటించి కంటి జబ్బులు దూరం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు లక్కరాజు శ్రీనివాసరావు, రోటరీ ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, సభ్యులు చప్పిడి వీరయ్య, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పువ్వాడ రామకోటేశ్వరావు, నర్రా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆజాద్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సాయుధ పోరాటంలో ఆంగ్లేయుల గుండెల్లో సింహస్వప్నమైన చంద్రశేఖర్ ఆజాద్ గొప్ప పోరాట యోధుడని ఫోరం ఫర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. సోమవారం చంద్రశేఖర్ ఆజాద్ 92వ జయంతి సందర్భంగా బాపట్ల పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద గల ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. లాహెూర్ అసెంబ్లీపై బాంబు దాడి, కకోరి రైలు దోపిడీ వంటి చర్యల ద్వారా బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టగా తనను తాను కాల్చుకొని ఆజాద్ అమరడయ్యాడని పేర్కొన్నారు. పిన్న వయసులో దేశం కోసం ఆయన చేసిన త్యాగం నిరుపమానమని కొనియడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే భారత జాతి ఆజాద్‌కు అందించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జమ్మద్ బాషా, తమలపాకుల భాస్కరరావు పాల్గొన్నారు.

జిల్లా పండిత పరిషత్ ఉపాధ్యాయ ఎన్నిక



ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-బాపట్ల

మున్సిపల్ ఉన్నత పాఠశాల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ బాపట్ల జిల్లా నూతన కార్యవర్గ సమావేశం సోమ వారం మున్సిపల్ హైస్కూలు ఆవరణలో జరిగింది. ఉపాధ్యాయ పండిత పరిషత్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు మునియ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపట్ల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గుంటూరు, ప్రకాశం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు, జిల్లా నూతన కమిటీ ఎంపిక నిర్వహించారు.

నూతన కార్యవర్గం

ఉపాధ్యాయ పండిత పరిషత్ బాపట్ల జిల్లా నూతన అధ్యక్షులుగా సిహెచ్ రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా వేముల ప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా వై శ్రీకృష్ణ, కోశాధికారిగా స్వర్ణ అజయ్ ఫణిశర్మ, మహిళ కార్యదర్శిగా ఎం సునీత ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ప్రకటించారు. పండిత పరిషత్ రాష్ట్ర బాధ్యులు ఎం నాగరాజు, భాస్కర్ నూతన కమిటీ ఎన్నికలను వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా 25 మండలాల హిందీ, తెలుగు ఉపాధ్యాయులు, యూనియన్ బాధ్యులు పాల్గొన్నారు.

వేమూరులోనే పది పరీక్ష కేంద్రం కొనసాగించాలి



అధికారికి అర్జీ ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-వేమూరు/బాపట్ల జిల్లా

వేమూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థుల పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో డిఇవో అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ.. వేమూరు మండలం వేమూరులో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ ఈ విద్యా సంవత్సరం ఏప్రిల్ మూడో తేదీన జరుగుతున్న ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షలకు పరీక్షా సెంటర్‌ను తీసివేసి ఈ విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న జంపని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్ష రాయడానికి సెంటర్‌ను ఇచ్చారన్నారు. జిల్లా విద్యా అధికారులు చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని యథావిధిగా పాత పద్ధతిలోనే వేమూరు నియోజకవర్గ కేంద్రంలోని ఎస్ఎస్‌సి బోర్డు పరీక్షల నిర్వహణకు జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్షా సెంటర్‌ను కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్య, రాజేష్, శ్రీను, మోహన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ ద్వారా మహిళలు ఉపాధి పొందవచ్చు



శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మెలకువలు నేర్పుతున్న శిక్షకులు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

టైలరింగ్ ద్వారా మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందవచ్చని మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటి డైరెక్టర్ లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. మిత్ర హోలిస్టిక్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో స్పందన స్ఫూర్తి సహకారంతో పిఠాపురంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందారన్నారు. పూర్తి చేసుకున్న మహిళలకు హనుమోజిపాలెం రోడ్డులోని సొసైటీ కార్యాలయంలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సింగర్ కంపెనీ వారు అందజేసిన సర్టిఫికెట్లతో పాటు రూ.1000 విలువ చేసే ప్రోత్సాహక కిట్టును కూడా స్పందన స్ఫూర్తి ప్రోగ్రాం మేనేజరు శ్రీనివాస్, మేనేజరు ప్రకాష్‌లు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారానికి శ్రద్ధ తీసుకోవాలి: జేసీ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ కె శ్రీనివాసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో స్పందన కార్యక్రమంలో తమ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో పేదలకు మంజూరయిన గృహాలన్నీ వారు నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పునాది దశలో ఉన్న గృహ నిర్మాణ లబ్ధిదారులకు డిఆర్‌డిఎ, మెప్మా ద్వారా బ్యాంక్ రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె లక్ష్మీ శివజ్యోతి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్ ప్రసాద్, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, పశుసంవర్థక శాఖ జెడి హనుమంతరావు, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ చంద్రశేఖర్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ డిఎస్ఓ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించాలి: ఎస్పీ



స్పందన కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు స్పందన కార్యక్రమంలో తమ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. పిటీషన్‌దారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణీత గడువులోపు ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు, ఇతర సమస్యల గురించి 43 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలు ఎస్పి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి మాలకొండయ్య పాల్గొన్నారు.

సమస్యల వలయంలో వసతి గృహం విద్యార్థులు



అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య, నాయకులు

ప్రజాశక్తి-రేపల్లె

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రేపల్లెలో ఉన్నటువంటి బీసీ కాలేజీ విద్యార్థుల వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని స్థానిక అధికారి మల్లికార్జునరావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కార్యదర్శి ఆర్య గత కొద్దిరోజులుగా రేపల్లె ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం పట్టణంలోని పలు హాస్టళ్లను సందర్శించిన నేపథ్యంలో తమ దృష్టికి విద్యార్థులు అనేక సమస్యలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. వాటిలో ముఖ్యంగా హాస్టల్లో ఉడికీ ఉడకని అన్నం పెడుతున్నారని, లేదంటే మెత్తగా చిమిడిపోయిన అన్నం పెడుతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ విషయంపై హాస్టల్ వార్డెన్లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. ముఖ్యంగా రేపల్లె తీర ప్రాంతంలో ఉన్న ఒకే ఒక్క ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చి విద్యార్థులు చదువుకుంటున్నారని, అటువంటి వారికి ఇక్కడ ప్రభుత్వ హాస్టళ్లు ఎంతగానో ఉపయోగపడు తున్నాయని, అటువంటి పేద విద్యార్థులకు నాణ్యతలేని ఆహారాన్ని వండుతూ విద్యార్థులను అనారోగ్యం పాలు చేయడం సరైనది కాదని అన్నారు. విద్యార్థులకు అందాల్సిన రాగిజావ, అరటిపళ్లు, కోడిగుడ్లు కూడా ఇవ్వడం లేదని హాస్టల్ నిర్వాహకుల తీరుపై ఆయన మండిపడ్డారు. ఇప్పటికే డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయని కొద్ది రోజుల్లో ఇంటర్ పాలిటెక్నిక్ పరీక్షలు కూడా రాబోతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే ఇస్తున్న మెస్ ఛార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, లేని పక్షంలో విద్యార్థులందరూ ఐక్యం చేసి అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు వాసు, రామకృష్ణ, సతీష్, హర్షక్, వైశాల్, దుర్గా భవన్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుండా...

ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమేనా..!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో నానాటికీ ట్రాఫిక్ పెరుగుతోంది. వానాల సంఖ్య పెరగడం. రహదారులు ఆక్రమణలతో కుచించుకుపోవడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో మార్కాపురంలో వాహనాల రాకపోకలు సాగించాలంటే కష్టతరంగా ఉంది. ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు... సాయంత్రం 4:30 గంటల నుంచి 6:30 గంటల సమయంలో ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. ఆయా సమయాల్లో ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలతో కార్యాలయాల పనివేళలు కావడంతో అందరూ ఒక్కసారిగా వాహనాలతో రహదారుల పైకి వస్తున్నారు. దీంతో ఆయా సమయాల్లో నిత్యం ఏదొక మార్గంలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. పోలీసులకు సైతం ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టమవుతోంది.

మార్కాపురంలో రహదారులు విశాలంగా ఉన్నాయి. ఆక్రమణలతో కుచించుకుపోయాయి. ఆక్రవణలు తొలగించేందుకు రాజకీయం అడ్డు తగులుతోంది. అధికారంలో ఎవరున్నా... ఆక్రమణల జోలికి మాత్రం వెళ్లడం లేదు. ప్రధాన మార్గాల్లో ఆక్రమించుకున్న భవన యజమానుల్లో అందరూ ఏదొక రాజకీయ పార్టీతో సత్సంబంధాలు కలిగిన వారే. దీంతో ఏ పార్టీ అధికారంలో ఉఉన్నా... ఆయా పార్టీల నాయకులు ఆక్రమణలపై కిమ్మనడం లేదు. ప్రధాన రహదారులన్నీ వ్యాపార సముదాయాలు కావడంతో ఆయా వ్యాపార సంస్థల్లో కొనుగోలు చేయడం కోసం వచ్చిన వారి వాహనాలు రహదారులపై నిలుపుకోక తప్పడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఆక్రమణలు తొలగిస్తే తప్ప మరో మార్గం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు సైతం ఆక్రమణల జోలికి వెళ్లడం లేదు. ప్రజా ప్రతినిధులను కాదని... ఆక్రమణల తొలగింపులో సాహసం చేయలేకున్నారు ఇక్కడి అధికారులు.!



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

తాత్కాలిక చర్యలు

పరిశీలించిన ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య కొంతైనా తొలగించేందుకు తాత్కాలిక చర్యలకు ఉపక్రమించారు. ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణలు అధికారులతో కలిసి ప్రధాన మార్గాల్లో సోమవారం పరిశీలన చేశారు. పట్టణంలోని దోర్నాల బస్టాండులో ప్రయాణికుల నీడ కోసం నిర్మించిన షెడ్డును వెనుకకు జరపాలని సూచించారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం పడమర వైపు ఉన్న పూలకొట్లను గడియారం గాంధీపార్కుకు తూర్పు భాగంలో ఎన్న చెప్పుల షాపుల వద్దకు మార్చాలని నిర్ణయించారు. పూలకొట్ల ప్రాంతం ఖాళీ అయితే అక్కడ బస్సులు, ఇతర ప్రయాణికుల వాహనాలు నిలుపుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కోర్టు కూడలిలో ఒంగోలు బస్టాండును ఎన్‌జిఒ హోం ప్రక్కన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ విధంగా కొంతమేర ట్రాఫిక్ నియంత్రణ చేసుకోవచ్చనే ఆలోచనతో తాత్కాలిక చర్యలకు ఉపక్రమించారు. ఆక్రమణల జోలికి వెళ్లకుండా ఈ విధమైన చర్యలతో ట్రాఫిక్ సమస్య పూర్తి స్థాయిలో నియంత్రణ కాదని పట్టణ ప్రజలు అంటున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరికుమమార్, సిఐ ఎం.భీమానాయక్, పట్టణ ఎస్ఐ శశికుమార్, మార్కాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ నరసింహులు, ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ బొగ్గరపు శేషగిరిరావు పాల్గొన్నారు.

సిఎంను కలిసిన ఎమ్మెల్యే మద్దిశెట్టి



సిఎం జగన్‌తో ఎమ్మెల్యే మద్దిశెట్టి

దర్శి : ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సోమవారం కలిశారు. దర్శిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తరగతి గదులు మంజూరు చేయాలని, దర్శి-దొనకొండ, గంగవరం- తాళ్లూరు, కురిచేడు-దొనకొండ (వయా రెడ్డెన్నపల్లి) రహదారులకు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మద్దిశెట్టి ఈ సందర్భంగా సిఎంను కోరారు. జలజీవన్ మిషన్ కింద మంజూరైన రూ.143 కోట్ల రూపాయల పనులు, దర్శి నగర పంచాయతీ తాగునీటి సరఫరా కోసం అమత పథకం కింద మంజూరైన రూ. 121 కోట్ల రూపాయల పనులకు త్వరితగతిన టెండర్లను పిలిచి పనులు ప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దర్శి పట్టణంలో కాపు కళ్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఎస్‌సి కమిషన్ చైర్మన్‌ను కలిసిన నేతపాలెం వాసులు

పొదిలి : పొదిలి నగర పంచాయతీ పరిధిలోని నేతపాలెం వాసులు ఎస్‌సి కమిషన్ చైర్మన్ సోమవారం కలిశారు. ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుముడి విక్టర్ ప్రసాద్ విజయవాడలో కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. చిన్నబస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు స్థలం మంజూరు చేయాలని, శ్మశాన వాటికకు రహదారి ఏర్పాటు చేయాలని, వడ్డే రమేష్ ఇంటి ప్రక్క నుంచి ఒంగోలు రహదారిలోకి దారి ఏర్పాటు గురించి మాట్లాడారు. పై సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతపాలెం వాసులు ధర్నాసి పెద్దన్న,రాము, రవి చంద్ర, రాజశేఖర్, హజరత్ ఉన్నారు.

సర్వేల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్



రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా సచివాలయల పరిధిలో జరుగుతున్న రీ సర్వేల పట్ల ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిపై వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. నగర పరిధిలోని 25వ డివిజన్ లంబాడివీధి సచివాలయాన్ని సోమవారం పరిశీలించారు. ఆ డివిజన్‌లో 1,200 గృహాలు ఉంటే అందులో ఇప్పటి వరకు కేవలం 40 గృహాలనే రీసర్వే చేయడం పట్ల కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ డివిజన్ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రీ సర్వేపై ప్రతిరోజూ మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పురోగతిపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. రీసర్వే పూర్తి చేయనివారిపై రీజనల్ డైరెక్టరే నేరుగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సర్వేలపట్ల నిర్లక్ష్యం వీడి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌డిజి, పిఎంజెఎవై సర్వేలను త్వరగా పూర్తి చేయాలన్నారు. పిఎం జెఎవై సర్వేను వాలంటీర్లు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అనంతరం ప్రజలు చెల్లించాల్సిన యూజర్ ఛార్జీలు, ఇంటిపన్నులు, నీటి పన్నుల వసూళ్ల గురించి సచివాలయ సిబ్బందితో చర్చించారు. దీర్ఘకాలికంగా పన్నులు బకాయిలు ఉన్నవారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. లంబాడి వీధి సచివాలయం పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ సమీక్షించారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి ఇంటిపన్నులు, నీటి పన్నులు సకాలంలో చెల్లించాలనిప్రజలను కోరారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-మేదరమెట్ల



మాట్లాడుతున్న ఆంజనేయులు

ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని, బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం. ఆంజనేయులు తెలిపారు. కోరిశపాడు మండలం రావినూతల గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమజీవుల, కష్టజీవుల గొంతుకను శాసన మండలిలో వినిపించడానికి పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డిని గెలిపించు కోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల, ఆశ వర్కర్ల, జాతీయ ఉపాధి పథకంలో ఉన్న సమస్యలను గురించి మాట్లాడాలంటే పిడిఎఫ్ అభ్యర్థుల విజయం తప్పనిసరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రవిబాబు, సత్యనారాయణ, కెవిపిఎస్ నాయకుడు కంచర్ల సురేష్, అంగన్‌వాడీ బాపట్ల జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.చైతన్య, అంగన్‌వాడీ లు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు ఆధ్వర్యంలో మండల పరిధిలోని బి. నిడమానూరు, చదలవాడ, నాగులుప్పలపాడు, అమ్మనబోలు, ఉప్పుగుండూరు, కండ్లగుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రశ్నించాలన్నా, ఐసిడిఎస్ పరిరక్షించు కోవాలంటే ఉద్యమ సారథులైన పిడిఎఫ్ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకశ్వరరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డిని గెలిపించు కోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌ను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి. బసవ పున్నయ్య ,అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

బాధితులకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని తంగిరాలపల్లి గ్రామ సచివాలయ కన్వీనర్ ఈశ్వరయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర పట్టణ మరియు పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం పరామర్శించారు. అనంతరం ఇటీవల నరసరావుపేట వద్ద జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మల్లవరం గ్రామానికి చెందిన కోలగట్ల వెంకటేశ్వర్ రెడ్డి, దుగ్గెంపూడి వెంకటేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అదేవిధంగా రామాయపాలెం సర్పంచి తమ్ముడు భార్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. బద్వీడుచెర్లోపల్లిలో గుండెపోటుతో మరణించిన బీరెడ్డి పెద్ద అల్లూరిరెడ్డి, బీరెడ్డి, చిన్నఅల్లూరిరెడ్డి చిత్రపటానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కష్ణారెడ్డి, ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, జడ్‌పిటిసి ఏరువ చలమారెడ్డి, వైస్ ఎంపిపి గుండారెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, సర్పంచులు రామాంజనేయరెడ్డి, ఆవులయ్య యాదవ్, శివకష్ణారెడ్డి, సుబ్బయ్యగౌడ్, చిన్నోడు, పొందుగుల వెంకటరెడ్డి, ఆదినారాయణ యాదవ్, నాగరాజు, ఎంపిటిసిలు పెద్దకాశయ్య, రాజరావు, వైసిపి నాయకులు కొండారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అల్లూరిరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ ఒద్దుల లక్ష్మిరెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ శొంఠి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి రజనితో డాక్టర్ అశోక్‌కుమార్

మంత్రిని కలసిన డాక్టర్ బత్తుల

శింగరాయకొండ : రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజినిని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల వైసిపి అనుబంధ విభాగాలు ప్రకటించిన నేపథ్యంలో శింగరాయకొండకు చెందిన డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డిని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించారు. అందులో భాగంగా డాక్టర్ అశోక్‌కుమార్ రెడ్డి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో స్టార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్, కో ర్డినేటర్ కెఎల్. నాగేశ్వరరావు, డాక్టర్ డి. చెంచురామిరెడ్డి, డాక్టర్ కె.రాజమోహన్ రెడ్డి, డాక్టర్ కల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ సిహెచ్. సత్యనారాయణ, స్టార్ ఫౌండేషన్ అధినేతలు సూరి కోటారెడ్డి దంపతులు, తన్మయ్ పాల్గొన్నారు.

'డయల్ యువర్ కలెక్టర్' అర్జీలపై ప్రత్యేక దృష్టి

డిఆర్ఒ చిన ఓబులేసు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజల నుంచి సోమవారం ఫిర్యాదులు విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలన్నారు. ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యలకు డిఆర్ఒ స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్పందన సూపరింటెండెంట్ నాగజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

– పుల్లలచెరువు మండలం, పుల్లలచెరువు గ్రామం నుంచి



డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఆర్ఒ

ఎం.ఆదెమ్మ ఫోన్ చేసి తమ భూమిని వేరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేశారని డిఆర్ఒ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని పుల్లలచెరువు మండల తహశీల్దారును ఆదేశించారు.

– కొరిశపాడు మండలం, కొరిశపాడు గ్రామం నుంచి పి.ఏడుకొండలు ఫోన్ చేసి గుండ్లకమ్మ ప్రాజెక్ట్ ల్యాండ్ ఎక్విజేషన్ కోసం 57 ఎకరాల భూమిని 33 మంది రైతులు ప్రభుత్వానికి ఇచ్చారని, ఇప్పటివరకూ నష్ట పరిహారం అందలేదని తెలిపారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తామని డిఆర్ఒ వారికి హామీ ఇచ్చారు.

– పొన్నలూరు మండలం తిమ్మపాలెం గ్రామం నుంచి ఎస్‌కె హుస్సేన్ ఫోన్ చేసి జిల్లా పరిషత్‌కు సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించారని డిఆర్ఒ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై సత్వరమే విచారణ జరపాలని జిల్లా పరిషత్ సిఇఒను డిఆర్ఒ ఆదేశించారు.

– తర్లుపాడు మండలం పోతలపాడు గ్రామం నుంచి ఆర్.బాబు ఫోన్ చేసి తమ పొలంలోకి పోవడానికి దారిని మూసివేశారని డిఆర్ఒకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ చేసి సమస్యను పరిష్కరించాలని తర్లుపాడు తహశీల్దారును డిఆర్ఒ ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డిని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈదుల రాజశేఖర్‌రెడ్డి పంచాయతీ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. యర్రగొండపాలెం పట్టణంలో డాక్టర్ వైఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, ఆర్‌టిసి బస్టాండ్ ఏర్పాటు, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రం ప్రారంభిండంలోనూ విశేషంగా కృషి చేసినట్లు చెప్పారు. ఆయన సేవలకు గుర్తింపు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డును అందుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ఇన్‌ఛార్జి, రెహమాన్, గౌస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు క్విజ్ పోటీలు

పెద్దదోర్నాల : ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రీజినల్ స్థాయిలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు అనంతపురంలో నిర్వహిస్తున్న సెంట్రల్ స్థాయిలో క్విజ్ పోటీలో పాల్గొంటారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని చిన్న గుడిపాడు పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. సుందరయ్య కాలనీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో రిసార్ట్ అసిసోయట్ గోపాల్, డిఎడి సెక్టార్ మేనేజర్ షణ్ముఖరావు, యర్రగొండపాలెం ఏరియా టీమ్ లీడర్ గిరిజ, అచ్చంపేట ఐడియా టీం లీడర్ రామ్మోహన్, లింగాల ఏరియా టీమ్ లీడర్ రాధా, చిన్న దోర్నాల స్కూల్ ఉపాధ్యాయులు కరుణాకర్, రాము, నాయక్, వెంకటేశ్వర్లు, వెంకట్, రత్నం పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

శింగరాయకొండ : శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో మూలగుంటపాడు సచివాలయం వద్ద వైసిపి విలేజ్ హెల్త్ క్లినిక్ కార్యక్రమంలో భాగంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ఉజ్వల సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పాఠశాలలను సందర్శించి పిల్లలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. నెలలో రెండు సార్లు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని డాక్టర్ ఉజ్వల తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షకులు సయ్యద్ మసూద్ అలీ, శ్రీనివాసులు, తేజస్వి, ఎఎన్ఎం రాధిక , జి. శ్వేత ,శ్రీకాంత్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుధాకర్‌కు వరికూటి పరామర్శ

టంగుటూరు : మండల పరిధిలోని సూరారెడ్డిపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు తక్కెళ్ళపాటి సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అందులో భాగంగా వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, వైసిపి నాయకులు సోమవారం సూరారెడ్డిపాలెం వెళ్లి సుధాకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్ బాబు ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి సుధాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. సుధాకర్ త్వరగా కోలుకోవాలని అశోక్ బాబు ఆకాంక్షించారు. సుధాకర్‌ను పరామర్శించిన వారిలో జెసిఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు, వైసిపి నాయకులు బీనీడి ఉదయ్ కుమార్, కుందం హనుమారెడ్డి, సనగర కోటి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



మాట్లాడుతున్న ఎస్ఐ

మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమం ఈనెల 20 నుంచి మార్చి 2వ వరకూ నిర్వహిస్తు న్నారు. ప్రచారోద్యమంలో భాగంగా సోమవారం స్థానిక కమలా కాన్వెంట్ స్కూల్లో విద్యార్థులకు మత్తు పర్దాల నివారణపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్) ఇన్‌స్పెక్టర్ ఎ.పద్మజ, మార్కాపురం గ్రామీణ ఎస్ఐ సుమన్ మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల వల్ల అనేక మంది విద్యార్థులు, యువత, ప్రజలు తమ జీవితాలను నాశనం చేసు కుంటు న్నారని తెలిపారు. విద్యార్థులు, యువత మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాశిం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్ రసూల్, కమలా స్కూల్ పర్యవేక్షకులు పి. పవన్‌కుమార్ ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

దొనకొండ : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో 7 సంవత్సరాల అనంతరం పెద్దమ్మ జాతరను రెండు రోజుల పాటు గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి బొరిగొర్ల ఉషామురళీ పెద్దమ్మకు నైవేద్యం సమర్పించారు. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

జెవివి జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్

ప్రజాశక్తి-మార్కాపురం



మాట్లాడుతున్న రవికుమార్

విద్యార్థినీ, విద్యార్థులు చదువు పట్ల అవగాహనతో సత్ఫలితాలు సాధించాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఏనుగుల రవికుమార్ తెలిపారు. జెవివి ఆధ్వర్యంలో సిద్ధార్థ జూనియర్ కళాశాలలో బాగా చదవండి-పరీక్షలకు సిద్ధం కండి అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ బట్టీ పద్ధతి సరికాదన్నారు. అవగాహనతో చదవాలన్నారు. ప్రణాళికా బద్ధంగా పాఠ్యాంశాలను తిరిగి పునశ్చరణ చేసుకోవాలన్నారు. సందేహాలను అధ్యాపకులచే నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షలంటే భయం వీడాలన్నారు. పరీక్షలకు తక్కువ సమయమే ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకున్న వారంతా విజయం సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ సాయిశెట్టి రాజాచార్యు శ్రీకాంత్, జన విజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి వడ్డే రవికాంత్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



ధర్నా నిర్వహిస్తున్న దళితులు

తప్పుడు స్వాధీనం పత్రం సమర్పించిన వ్యక్తిపై చర్యలు తీసుకొని దళితులకు న్యాయం చేయాలని కోరుతూ చేస్తూ పుల్లలచెరువు తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ చదువు లేని దళితులను మోసం చేసి వారికి ప్రభుత్వం ఇచ్చిన భూమిని అన్యాయంగా లాకున్నారని తెలిపారు. ఈ విషయంపై ఒంగోలు స్పందన కార్యక్రమంలో బాధిత దళితులు ఆరు సార్లు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. అయిన ప్పటికీ ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. తహశీల్దారు రెండుసార్లు ఈ భూముల విషయంలో రిపోర్ట్ రాసి ఉన్నతాధికారులు నివేదిక పంపినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. అనంతరం తహశీల్దారు దాసుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళితులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవిలపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



టంగుటూరులో మాట్లాడుతున్న ఎపిఎం

మండల సమాఖ్య నెల వారి ఇసి సమావేశం కొర్రపోలు జ్యోతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం. రంగసుబ్బ రాయుడు మాట్లాడుతూ ఆజాదీ కా అమృత మహోత్సవ్ 2.0లో భాగంగా విఒఎలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రత పథకాలపై అవగాహన కల్పించారు. చిరు వ్యాపారులకు 6వ విడత తోడు రుణాల మంజూరులో టార్గెట్‌లను పూర్తి చేయాలన్నారు. ఐకెపి ఎసి లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెల విఒలు ఇసి సమావేశం ఏర్పాటు చేసుకొని బుక్స్ రాయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం మూల వెంకిరెడ్డి, సిసిలు ఇబ్రహీం, నాగయ్య, మోషే, జ్యోతి, అకౌంటెంట్ మాధవి, ఎంఎస్ఇసి సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు. **టంగుటూరు :** ఆర్థిక మోసాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని స్త్రీనిధి నియోజకవర్గ మేనేజర్ ఎం. శ్రీనివాసరావు, వెలుగు ఎపిఎం గంటా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక మోసాల నివారణపై సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక మోసాలను నివారించేందుకు రుణాల చెల్లింపులు అన్నీ పొదుపు గ్రూపు మహిళలే నేరుగా బ్యాంకులలో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం గంటా శ్రీనివాసరావు, వెలుగు సిసిలు మేడా వెంకట్రావు, కె.చిన్నరాజు, చోడాబత్తిన గోవిందమ్మ, కవిత, కె.పద్మజ, విఒఎలు పాల్గొన్నారు.

తర్లుపాడు : ఆజాదీకా అమృత మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల మహిళా సమైక్య సభ్యులు, గ్రామ సంఘ విఒఎలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023 జనవరి 2 నుంచి 2023 ఆగస్టు 15 వరకూ స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ ఆర్థిక సేవలు డిజిటల్ లావాదేవీలు, సామాజిక భద్రతా పథకాలను ఉపయోగించుకునే విషయాలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు సుభాషిణి, కార్యదర్శి రంగరత్నమ్మ, దిబ్బమ్మ, మరియమ్మ, స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఎల్ఏ.నాగభూషణం, సిసిలు సాయిలు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విఒఎలు, ఇసిలు పాల్గొన్నారు.

జగన్‌ది సంక్షేమ పాలన

రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు

ప్రజాశక్తి-రేపల్లె

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు కోరారు. సోమవారం రేపల్లె మండలం బేతపూడి పంచాయతీలోని తురకపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మునుపెన్నడూ లేని విధంగా నవరత్నాల పేరుతో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే రీతిలో పరిపాలన చేస్తోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలను ముందుగా పేర్కొన్న



ప్రజలతో మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణారావు

క్యాలెండరు ప్రకారం అమలు చేస్తున్నామన్నారు. పేద ప్రజలను సంక్షేమ పథకాలతో ఆదుకోవడం ప్రతిపక్ష పార్టీలకు నచ్చడం లేదని, దీంతో ప్రభుత్వంపై లేనిపోని అపనిందలు వేస్తూ ప్రతిపక్షాలు ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగుతోందని, రాబోయే రోజుల్లో కూడా జగన్‌కు ప్రజల ఆశీర్వాదాలు కావాలని కోరారు. జగనన్న గృహ సారథులు, గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు స్థానికంగా ఉన్న నాయకులతో కలిసి పనిచేస్తే 2024లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవటం ఖాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సమస్యలను పరిష్కరించాలని కోరగా అందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జడ్పిటిసి బొర్రా లక్ష్మి శ్రీనివాసరావు, ఆలూరి పద్మ సర్పంచ్, ఆలూరి రవితేజ రూరల్ కన్వీనర్, గాదె వెంకయ్య బాబు వైసిపి నాయకులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

కిమ్స్ హాస్పిటల్ ఒంగోలు, భవనం శ్రీనివాస్‌రెడ్డి, ఇంకొల్లు జడ్పిటిసి సభ్యురాలు భవనం శ్రీలక్ష్మిగార్ల సహకారంతో ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో కంటికి సంబంధించిన పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ, విష జ్వరాలు లాంటి వ్యాధులకు వైద్యులు జాగ్రత్తలు చెప్పారు. శిబిరంలో మొత్తం 250 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగ నిర్ధారణ జరిగిన 50 మంది పేషంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్, కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ తెలిపారు. ఈ క్యాంపులో ఇంకొల్లు ఎంపిటిసి సభ్యులు షేక్ హాయేషాబుడే, వంకాయలపాడు ఎంపిటిసి సభ్యురాలు యామర్తి శిరోమణి, డాక్టర్ రామాంజనేయులు, రాణి, కిమ్స్ హాస్పిటల్స్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-బాపట్ల

విదేశాల్లో ఉన్నత విద్యావకాశాల పట్ల వ్యవసాయ విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల(1969బ్యాచ్) పూర్వ విద్యార్థి యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ప్రొఫెసర్ డాక్టర్ ఏఎల్ఎన్ రావు విద్యార్థులకు సూచించారు. సోమవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విదేశాల్లో విద్య అనే అంశంపై ఏఎల్ఎన్ రావు వ్యవసాయ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల అసోసియేట్ డీన్ వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రావు మాట్లాడారు. అమెరికాలోని విశ్వ విద్యాలయాలలో ఎమ్మెస్సీ, పిహెచ్‌డి విద్యలో ప్రవేశాలు పొందే విధానాన్ని ఆయన వివరించారు. విదేశాలలో ఉన్నత విద్యావకాశాల పట్ల అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఉన్నతోద్యోగాలు పొందాలన్నారు. అక్కడ ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని పొందేందుకు సదుపాయాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పూర్వ ఎంటమాలజీ విభాగాధిపతి జి రాఘవయ్య, ప్లేస్‌మెంట్ అధికారి డి సాయిరాం కుమార్, ఓఎస్ఏ లాల్ అహమద్ మొహమ్మద్, బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి పరిశీలన

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని నడింపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎల్ఇ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు నూతన భవనం నిర్మించేందుకు 46 లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయని డిఆర్‌డిఎ పిడి బి అర్జున్‌రావు తెలిపారు. సోమవారం శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వారిచే పాఠశాల విద్య నిధుల ద్వారా నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఏమినేని సుబ్బారావు, గ్రామ సచివాలయ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న దృశ్యం

జీవీ నాగేశ్వరరావుకు మాతృవియోగం

ప్రజాశక్తి-రేపల్లె: తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావుకు మాతృ వియోగం జరిగింది. ఆయన తల్లి లీలావతి సోమవారం ఉదయం మృతిచెందారు. ఈ సందర్భంగా ఆమె పార్థివ దేహాన్ని పలువురు టిడిపి, సిపిఎం, సిపిఐ నాయకులు, పద్మశాలి ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అనగానీ సత్యప్రసాద్ ఫోన్ ద్వారా నాగేశ్వరరావుతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, టిడిపి పట్టణ కన్వీనర్ పట్టాభి రామారావు, రూరల్ కన్వీనర్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్, సిపిఐ పట్టణ కార్యదర్శి బాలాజీ, పద్మశాలి ప్రముఖులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందన సరే.. అధికారులు లేరీ?

ప్రజాశక్తి-కర్లపాలెం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి కర్లపాలెం మండలంలో పూర్తి స్థాయిలో అధికారులు పాల్గొనడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను పరిష్కరించడానికి వీలుగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే కొంతమంది అధికారులు మాత్రం హాజరు కాకపోవడం వలన మండల ప్రజల సమస్యలు అలానే ఉన్నాయని ప్రజలు అంటున్నారు. కొన్ని శాఖల అధికారులు హాజరు కాకుండా వారి కింద స్థాయి సిబ్బందిని పంపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అధికారులను అందుబాటులో ఉంచి ప్రజల సమస్యలు తీరే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లక్ష్మీ నృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

అల్లూరు గ్రామంలోని లక్ష్మీ నసింహస్వామి దేవాలయంలో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు మధు సూదన రెడ్డి సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాషాయం కట్టి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆయన రాక తెలుసుకున్న పిట్టలవానిపాలెం మండల ప్రజలు వందల సంఖ్యలో దేవాలయ ప్రాంగణానికి చేరుకున్నారు. పూజ అనంతరం ప్రజలతో, అభిమానులతో మాటా మంతి నిర్వహించారు. వివిధ గ్రామల నుంచి వచ్చిన అభిమానులు రాబోయే రోజుల్లో మధుసూదన్‌రెడ్డిని బాపట్ల శాసనసభ్యులుగా చూడాలని నినాదాలు చేశారు. ఆయన తండ్రి అప్పటి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు మరోసారి గుర్తు చేసుకున్నారు. గడిచిన రోజుల్లో వెనుకబడిన గ్రామాలకు అభివృద్ధి ప్రదాత గాదె వెంకటరెడ్డి అని, ఆయన తనయునికి ప్రజలు తెలియజేశారు. అభివృద్ధి అనేది మాటల రూపంలో కాకుండా చేతల రూపంలో చేస్తే ప్రజాభిమానం ఎలా ఉంటుందో మధు సూదనరెడ్డి చూసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల కోరిక మేరకు రానున్న రోజుల్లో ప్రజలకు అండగా ఉంటానని, జగన్మోహన్ రెడ్డి ఆదేశిస్తే బాపట్ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తానని అన్నారు.



మాట్లాడుతున్న మధుసూదనరెడ్డి

ఫొటోగ్రాఫర్ నాగరాజుకు అంతర్జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల ఫొటోగ్రాఫర్ నాగరాజుకు అంతర్జాతీయ పురస్కారం దక్కింది. సైప్రస్ దేశానికి చెందిన నికోసియా ఫొటోగ్రాఫిక్ సొసైటీ, డిసెంబర్ 2022లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో నాగరాజు ఫొటోలను పంపారు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పివిఎస్ నాగరాజుకు అవార్డు ప్రకటించారు. నాగరాజు కలర్ విభాగంలో పంపిన ఫొటోలకు న్యాయనిర్ణేతలు ముగ్ధులై ఎంపిక చేశారు. నాగరాజుకు సొసైటీ చైర్‌పర్సన్ ఇమెయిల్ ద్వారా అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు నాగరాజుకు 'జాతీయ స్థాయిలో 81, అంతర్జాతీయ స్థాయిలో 55', మొత్తం 136 అవార్డులు వచ్చాయి. నాగరాజుకు బాపట్ల ఫొటోగ్రాఫర్లు పలువురు అభినందనలు తెలిపారు.

అనుమతులు లేకుండా లే అవుట్ వేయొద్దు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామంలో అనధికార లేఅవుట్‌లు వేసిన కొట్రా శ్రీనివాసరావుకు సంబంధించిన 2 ఎకరాలు 67, 74 సర్వే నెంబర్ లే అవుట్, అలాగే బాబుల్ రెడ్డి అనే వ్యక్తికి చెందిన 2 ఎకరాలు సర్వే నెంబర్ 67లకు డిఎల్పీఓ పులి శరత్‌బాబు సోమవారం నోటీసులు జారీ చేయించారు. సోమవారం ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇలాంటి లే అవుట్ లలో స్థలాలు కొనుగోలు చేస్తే పంచాయతీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె ఝాన్సీ లక్ష్మీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు విజ్ఞాన భారతి హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-చీరాల: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా నేడు పట్టణంలోని ఉడ్ నగర్‌లో ఉన్న స్థానిక విజ్ఞాన భారతి హైస్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్ జరుగుతుందని ప్రిన్సిపాల్ షేక్ కరిముల్లా సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో సరోజిని హాజరై ప్రారంభిస్తారని అన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 వరకు జరుగుతుందని, చీరాల పరిసర ప్రాంత విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించి సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆమె కోరారు. విద్యార్థులు తయారు చేసిన సాంకేతిక రంగాలలోని నూతన ఆవిష్కరణలకు సంబంధించిన పలు ప్రదర్శనలు నిర్వహిస్తున్నారని, కావున విద్యార్థులందరూ ఎగ్జిబిషన్‌ను సందర్శించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె పట్టణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. బస్టాండ్ ఏరియా, లక్ష్మి టాకీస్ సెంటర్ ఏరియా, బస్టాండ్ వద్ద నుంచి బేతపూడి సెంటర్ వరకు దక్షిణం వైపు మొత్తం ఏరియా మరియు గురువు రోడ్, నిజాంపట్నం రోడ్డు, జగనన్న కాలనీ, అరుంధతి నగర్, ఉప్పూడి రోడ్, ఉప్పూడి ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని ఆరుంబాక ఎస్సీ కాలనీకి చెందిన వేము కిషోర్ అనారోగ్యంతో మృతి చెందడంతో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా మట్టి ఖర్చులు నిమిత్తం సచివాలయం సిబ్బంది 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మృతుని భార్య వేము హేమకు సోమవారం అందజేశారు. రాజ్యసభ సభ్యులు పంపిన ఆర్థిక సాయాన్ని గ్రామ పెద్దలు మృతుని ఇంటి వద్ద అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సిపిఎం నిర్మాణదక్షులు సూరా పాపిరెడ్డి

- విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలం వైపు మొగ్గు
- రైతాంగ పోరాటంలో దిట్ట
- ఎమ్మెల్యేగా ప్రజాహిత కార్యక్రమాలు
- నేడు పాపిరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిపిఎం నిర్మాణ దక్షులుగా సూరా పాపిరెడ్డి నిలిచారు. విద్యార్థి దశ నుంచి వామపక్ష భావజాలం వైపు మొగ్గు చూపారు. రైతాంగ సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేశారు. ఎమ్మెల్యేగా ప్రజాసంక్షేమ కార్యక్రమాల అమలుకు కృషి చేశారు. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా చేసిన పోరాటాలను, సేవలను మననం చేసుకుందాం.

కనిగిరి తాలూకా వెలిగండ్ల మండలం సూరావారిపల్లి గ్రామంలో 1929 సెప్టెంబర్ 10న ఒక ధనిక రైతు రైతు సూరి మాలకొండారెడ్డి, కొండమ్మ దంపతులకు పాపిరెడ్డి జన్మించారు. ఆయనకు ఐదుగురు సోదరులు, ముగ్గురు అక్కా చెల్లెళ్లు. 1952లో సీతారావమ్మతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. వీరిలో పెద్ద కుమారుడు డాక్టర్ ఎస్ఆర్ నెల్లూరు ప్రజా వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పాపిరెడ్డి కనిగిరిలో 6 ఫారం వరకు చదివారు. 1947లో నెల్లూరు విఆర్ కాలేజీలో ఎఫ్.ఎ చదివి 1952లో మద్రాస్‌లో ఇంజనీరింగ్ చదివారు. విద్యార్థి దశలోనే వామపక్ష భావాల వైపు ఆకర్షితులై 1948లో నెల్లూరులో చదువుతున్నప్పుడు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శిగా పని చేశారు. కనిగిరి, పొదిలి, దర్శి ప్రాంతాలలో ఫెడరేషన్ నిర్వహించి విస్తరణకు కృషి చేశారు. 1956లో నెల్లూరు జిల్లా యువజన మహాసభ కనిగిరిలో జరిగింది. కమిటీ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1960లో నిర్మాణ సౌలభ్యం కోసం ఉత్తర నెల్లూరు ప్రాంత పార్టీ కమిటీని ఏర్పాటు చేసి ఆ కమిటీకి కోటపాటి గురుస్వామిరెడ్డి మొదటి కార్యదర్శిగా, ఆ కమిటీలో పాపిరెడ్డి కమిటీ సభ్యులుగా ఉన్నారు. పార్టీ 1964 చీలికలో ఎస్‌పిఆర్ సిపిఎం వైపు ఉన్నారు. ఉత్తర నెల్లూరు జిల్లా కార్యదర్శిగా ఎన్నుకోబడి పనిచేశారు. 1967 పార్టీ చీలికలో నక్సలైట్స్ వైపు వెళ్లారు. 1968లో నాటి నక్సల్ నాయకుడు తరిమెల నాగిరెడ్డిని శింగరాయకొండకు పిలిపించి సమావేశం నిర్వహించారు. ఆ ప్రాభవంతో కమ్యూనిస్టు ఖిల్లాగా ఉన్న కనిగిరి ప్రాంతంలో సభ్యులందరూ నక్సలిజం వైపు మొగ్గారు. రెండున్నర సంవత్సరాల తరువాత పాపిరెడ్డి తన తప్పు తెలుసుకొని తీవ్రవాద నక్సలైట్ రాజకీయాలను వ్యతిరేకించి బయటకు వచ్చారు. రాజకీయంగా మార్క్సిస్ట్ వైపు నిలబడక పోవటంపై తన తప్పును ఆత్మ విమర్శ చేసుకున్నట్లు పాపిరెడ్డి తన ఆత్మకథలో రాసుకున్నారు.

1970 నుంచి సిపిఎం వైపు నిలబడి పేద ప్రజల పక్షాన పోరాటాలు చేశారు. రైతు నాయకుడిగా రైతాంగ సమస్యలపై సమరశీలంగా పోరాడారు. 1972లో జరిగిన ఎన్నికల్లో సిపిఎం బలపర్చిన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి కనిగిరి ఎమ్మెల్యేగా గెలిచి.. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి ప్రజా నాయకునిగా ఎదిగారు. 1978లో సిపిఎంలో చేరి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కనిగిరి, దర్శి, మార్కాపురం, కందుకూరు, పామూరు, సిఎస్‌పురం ప్రాంతాలలో సిపిఎం నిర్మాణానికి కృషి చేశారు. పాత సంబంధాలను కూడగట్టి పార్టీ నిర్మాణ విస్తరణకు కృషి చేసిన గొప్ప నిర్మాణ దక్షుడు పాపిరెడ్డి. 1978 నుంచి 1995 వరకు పూర్తికాల కార్యకర్తగా పనిచేశారు. 1962 ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుంచి, 1967 లో కనిగిరి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1959, 1981 పంచాయతీ సమితి ఎన్నికలలో వెలిగండ్ల సమితికి పోటీ చేసి కొద్ది ఓట్లతో ఓడిపోయారు. 1972లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు వచ్చే పెన్షన్‌ను పార్టీకి జమ చేసి అలవెన్స్ మాత్రమే తీసుకొని పనిచేశారు. చిన్న, పెద్ద, అన్ని రాజకీయ పార్టీల నేతలలో పాపన్న గుర్తింపు దక్కించుకున్నారు. కుటుంబ, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలు, పొలం వ్రిక్రయాలు, పెండ్లి సంబంధాలు, గహ నిర్మాణాలు, ఇలా అన్ని విషయాలలో ప్రజలకు మంచి సలహాలు ఇచ్చి పాపన్నగా కనిగిరి ప్రాంత ప్రజలకు తలలో నాలుకలా వ్యవహరించారు.



శాసనసభ్యునిగా విశేష కృషి

ఎమ్మెల్యేగా సూరా పాపిరెడ్డి విశేష కృషి చేశారు. కనిగిరి ఆర్టీసీ డిపోకు, పాలకేంద్రానికి స్థల సేకరణకు కృషి చేశారు. పామూరు మండలం మోపాడు రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టులో లేని భూములకు, లక్ష్మీ నర్సాపురం, పుట్టమనాయుడుపల్లి పంచాయతీ పరిధిలోని భూములకు నీరు ఇప్పించి ఆయకట్టులో చేర్చారు. కట్టి తోలేని నీరు ఇప్పించి ఆయకట్టులోకి చేర్చడం, పామూరు మేదర సొసైటీ ఏర్పాటు, చిలకపాడు సొసైటీ 305 రైతులకు భూములు ఇప్పించారు. నుచ్చుపొద ఫిషరీస్ సొసైటీ ఏర్పాటు, ఎన్జీవో కాలనీ ఏర్పాటు, పామూరు కరెంట్ ఆఫీస్‌కు స్థల సేకరణ చేశారు. సిఎస్‌పురం మండలానికి విద్యుత్ పిల్లిపల్లి నుంచి కొనపల్లి రహదారి ఏర్పాటుకు ప్రతిపాదన, అంబవరం రోడ్డు ఏర్పాటుకు కృషి చేశారు. సాగర్ కుడి కాల్వ ఏర్పాటు చేయాలని, వెలిగొండ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని, రైతు పోరాటాలను నడిపారు.

జైలు జీవితం

1948లో ఎస్ఎఫ్ఐలో పని చేస్తున్నప్పుడు కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారు. పాపిరెడ్డి 11 రోజులు జైలు శిక్ష అనుభవించారు. 1964లో పార్టీ చీలిక సందర్భంలో డిసెంబర్ 30వ తేదీన పోలీసులు అరెస్టు చేశారు. తీవ్ర నిర్బంధం విధించారు. రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. 1966 మేలో జైలు నుంచి విడుదలయ్యారు. పాపిరెడ్డి మృదు స్వభావి. కార్యకర్తలను కష్టాలలో ఆదుకోవటం, వారికి శిక్షణ ఇవ్వటం, రాజకీయ తరగతులు తీసుకొని కార్యకర్తలకు సులభ శైలిలో బోధించటం ఆయన ప్రత్యేకత.

మార్చి నుంచి క్రియాశీలక రాజకీయాల్లోకి..

ఎంసిని మాజీ చైర్మన్ శింగరాజు రాంబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



శింగరాజు రాంబాబు

మార్చి నుంచి జిల్లాలో క్రియాశీలక రాజకీయాల్లోకి రానున్నట్లు ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు, సీనియర్ రాజకీయ నాయకులు శింగరాజు రాంబాబు తెలిపారు. సోమవారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. తాను వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ నగర అధ్యక్షుడి పదవి రేసులో ఉన్నానని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. గత 30 ఏళ్లగా జిల్లా రాజకీయాల్లో ఉన్నానని వివరించారు. ఏ స్థాయిలో పనిచేయాలనే విషయం మీద తనకు స్పష్టత ఉందని చెప్పారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా, వైఎస్‌చైర్మన్‌గా, ఇన్‌చార్జి చైర్మన్‌గా, మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రజలకు సేవలం దించానని గుర్తు చేశారు. ప్రజలకు మంచిచేసే విషయంలో, అండగా నిలబడే విషయంలో, తప్పును ప్రశ్నించే విషయంలో తమ కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. రాజకీయాల్లో గాడ్‌ఫాదర్ లేక ఉన్నతమైన పదవులు చేయడానికి అవకాశం రాలేదని వివరించారు. తాను ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వర్తించిన పార్టీలలో చాలా మందికి టౌన్‌ప్రెసిడెంట్‌గా పనిచేసేందుకు ప్రోత్సాహం ఇచ్చానని గుర్తు చేశారు. తన రాజకీయ కార్యాచరణను త్వరలోనే ప్రజలకు తెలియజేస్తానని పేర్కొన్నారు.



ప్రకృతి వ్యవసాయం తీరును పరిశీలిస్తున్న నెదర్లాండ్ బృందం

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

కొలలపూడిలో పర్యటించిన నెదర్లాండ్ బృందం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రకృతి వ్యవసాయం ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా రైతులు, డ్వాక్రా మహిళలు పండిస్తున్న పంటల పట్ల అవలంబిస్తున్న సేద్యపు విధానాలను నెదర్లాండ్ దేశానికి చెందిన సర్వ నట్రూస్ తమ బందంతో బాపట్ల జిల్లా మార్టూరు మండల పరిధిలోని కోలలపూడి గ్రామంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. వైయస్సార్ కడప జిల్లా, పులివెందులలో జర్మనీ దేశానికి చెందిన కేఎఫ్‌డబ్ల్యు బ్యాంకు ఆర్థిక సహాయంతో ప్రకతి వ్యవసాయానికి సంబంధించిన యూనివర్సిటీని స్థాపించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ప్రకతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతుల సమస్యలు, సూచనల కోసం కోలలపూడి గ్రామంలో ముఖాముఖి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్వాక్రా గ్రూప్ మహిళలకు అందుతున్న రుణాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా కోలలపూడి గ్రామానికి చెందిన రైతు భోలగాని వెంకటస్వామి పండించిన పంటలను పరిశీలించారు. అనంతరం బొల్లాపల్లి కి చెందిన రైతు కష్ణమూర్తి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు వాడి పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని, ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉండాలి అంటే ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ బాపట్ల జిల్లా అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన మండలాలలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న ప్రకతి వ్యవసాయ పంటల గురించి నెదర్లాండ్ బందానికి వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తున్నట్లు నెదర్లాండ్ బందం ప్రతినిధి సర్వనట్రూస్ అన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, సిబ్బంది కిరణ్, గ్రామ సర్పంచ్ మోరపాకుల సతీష్‌కుమార్, స్థానిక రైతులు, డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే రాజకీయం

గుజ్జుల రవీంద్ర వెల్లడి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్



ప్రజలతో మాట్లాడుతున్న రవీంద్ర

సిపిఐ అగ్రనాయకుల్లో ఒకరైన గుజ్జుల యలమందారెడ్డి స్ఫూర్తితోనే జర్మనీలోని ఆర్లాస్ బర్గ్ రాష్ట్రంలో రాజకీయంగా ముందుకు సాగుతున్నానని ఆయన కుమారుడు గుజ్జుల రవీంద్ర తెలిపారు. సోమవారం ఒంగోలు వచ్చిన ఆయన స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తాను చదువు కోసం జర్మని వెళ్లి అక్కడే డాక్టర్ వృత్తిలో స్థిరపడి పెళ్లి చేసుకున్నానని వివరించారు. ప్రస్తుతం ఆర్లాస్ బర్గ్ రాష్ట్రంలో మేయర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వరుసగా ఐదుసార్లు మేయర్‌గా ఎన్నిక కావడం జరిగిందన్నారు. అంతకు ముందు ఎంపీగా కూడా ఎన్నికైనట్లు తెలిపారు. ఒక భారతీయుడిగా జర్మని రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకున్నానంటే అందుకు కారణం తన తండ్రి గుజ్జుల యలమందారెడ్డి అని చెప్పారు. ఆయన కనిగిరి ఎమ్మెల్యేగా మూడుసార్లు, ఎంపీగా ఒకసారి గెలుపొందిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. బహుశా భారతదేశ రాజకీయాలకు తాను సరిపోతానో లేదో కూడా తెలియదన్నారు. తన తల్లి దండ్రుల పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. యల్లమందారెడ్డి శత జయంతి ఉత్సవాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించతలపెట్టినట్లు తెలిపారు. కనిగిరిలో ఏర్పాటు చేసిన పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జర్మని నుంచి వచ్చానని తెలిపారు. రవీంద్ర భార్య గాబి గుజ్జుల మాట్లాడుతూ భారత దేశ ప్రజలంటే తనకు చాలా ఇష్టమని పేర్కొన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ రవీంద్ర తండ్రి పేరు నిలబెట్టే విధంగా జర్మనీలో రాజకీయంగా ముందుకు సాగడం సంతోషదాయకమన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ గుజ్జుల రవీంద్ర, ఆయన భార్య గాబి గుజ్జులను పరిచయం చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు పాల్గొన్నారు. గుజ్జుల రవీంద్ర, ఆయన సతీమణిని సిపిఐ శ్రేణులు ఘనంగా సత్కరించాయి.

నేరేడుపల్లెలో పర్యటన

నేరేడుపల్లెలో గుజ్జుల రవీంద్ర బాబు పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గుజ్జుల యలమందారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

సాయికుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికలలో ప్రధాన కార్యదర్శిగా అత్యధిక మెజార్టీతో గెలిచిన వి. సాయికుమార్‌ను పలు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. సోమవారం సాయికుమార్ ఒంగోలు విచ్చేసిన సందర్భంగా నగరంలోని పలువురు న్యాయవాదులు, ముస్లిం సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి గా అత్యధిక మెజార్టీతో గెలుపొందినందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, దుశ్శాలువ తో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్.ఈశ్వరరావు, ఎండి ఫయాజ్, జి సురేంద్ర, యం. ప్రమోద్, జె. అనిల్ కుమార్, యం.హరి ప్రసాద్ పాల్గొన్నారు.